సాక్షి తిరుపతి
మంగళవారం, 23, జూలై, 2024



అమ్మో..గ్రీవెన్స్
కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదికపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులను కలవాలంటే గగనంగా మారుతోంది. - 8లో



కలెక్టరేట్‌లో ఆగిన లిఫ్ట్
తిరుపతి కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10.50 గంటలకు లిఫ్ట్ ఆగిపోయింది. ఫిర్యాదుదారులు ఇబ్బందులు పడ్డారు. - 8లో



లారీ బోల్తా
భాకరాపేట కనుమలో లారీ బోల్తాపడింది. ఈ ఘటనలో క్లీనర్ మృతిచెందాడు. మరో నలుగురు గాయపడ్డారు. - 8లో

న్యూస్‌రీల్

25న బీటెక్ డ్యూయల్ డిగ్రీకి కౌన్సెలింగ్

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ, స్వీడన్‌కు చెందిన బ్లేకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సంయుక్తంగా నిర్వహించే బీటెక్ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌కు ఈనెల 25న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు వర్సిటీ అధికారులు తెలిపారు. బీటెక్ డ్యూయల్ డిగ్రీలో చేరే విద్యార్థులు మూడేళ్ల పాటు మహిళా వర్సిటీలో కోర్సు చదవాల్సి ఉంటుందని, మరో ఏడాది పాటు స్వీడన్‌లోని బ్లేకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో విద్యనభ్యసించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇంటర్‌లో 70 శాతం మార్కులు సాధించి, ఏపీ ఈఏఎమ్‌సెట్–2024లో అర్హత సాధించిన మహిళా అభ్యర్థులు ఈ కోర్సుకు అర్హులని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థినులు గురువారం వర్సిటీలోని సావేరి సెమినార్ హాల్‌లో ఉదయం 10గంటలకు జరిగే కౌన్సెలింగ్ ప్రక్రియలో పాల్గొనవచ్చని సూచించారు. మరిన్ని వివరాలకు మహిళా వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను కానీ ఫోన్ నం.7995973878లో కానీ సంప్రదించాలని కోరారు.

అసత్య ప్రచారాలు నమ్మొద్దు

తిరుపతి(అలిపిరి): టీటీడీలోని లడ్డూ కౌంటర్, రూమ్స్ అలాట్మెంట్ పర్సన్స్ నియామకం కోసం నోటిఫికేషన్ అంటూ ఇటీవల మీడియాలో అసత్య ప్రచారం జరుగుతోందని శ్రీ లక్ష్మీ శ్రీనివాస మ్యాన్ పవర్ కార్పొరేషన్ సీఈవో వైవీకే షణ్ముఖ్‌కుమార్ తెలిపారు. ఏదైనా ప్రకటన విడుదల చేసిన సమయంలో సంబంధిత వెబ్ సైట్ "rrmpc.in'లో ప్రచురిస్తామని పేర్కొన్నారు. ఉద్యోగార్థులు అసత్య ప్రకటనలతో మోసాలకు గురికావద్దని సూచించారు.

నిఘా నీడలో పాకాల

పాకాల: శాంతి భద్రతలు కాపాడడం కోసం నిఘా నీడలో పాకాల ఉందని, ఇక్కడ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామని సీఐ శ్రీరాముడు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆదివారం జరిగిన గొడవల్లో ఇరు పార్టీల నుంచి ఫిర్యాదులు అందాయని, ఆ మేరకు కేసులు నమోదు చేశామని, మిగిలిన విషయాలు విచారణలో తెలాల్సి ఉందన్నారు. చట్టానికి ఎవరూ అతీతులు కారని, ఎవరు తప్పు చేసినా శిక్షార్హులని హెచ్చరించారు. చిత్తూరు రోడ్డు, ఆర్టీసీ బస్‌స్టాండ్ సర్కిల్‌తో పాటు పలు సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశామన్నారు. చట్ట వ్యతిరేఖ చర్యలకు పాల్పడే వారు ఏ పార్టీకి చెందిన వారైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడే వారి వివరాలను పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

వరదపై అప్రమత్తం



తిరుపతి అర్బన్: వరదలొస్తే ఎదుర్కోవడానికి అన్ని విభాగాల అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ఆదేశించారు. సోమవారం ఆయన అధికారులతో వరదలపై సమీక్షించారు. సాధారణంగా జిల్లాకు నవంబర్, డిసెంబర్‌లో వర్షాలు వస్తుంటాయని చెప్పారు. దేశంతోపాటు రాష్ట్రంలో వస్తున్న వరదలను ఉదాహరణగా వివరించారు. అలాంటి పరిస్థితులు జిల్లాపై పడితే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రధానంగా 108 అందించాల్సిన వైద్యసేవలు, ఇరిగేషన్ వారు కరకట్టలు, చెక్‌డ్యామ్‌లు, ఆర్అండ్‌బీ అధికారులు రోడ్లు, ప్రత్యామ్నాయ రోడ్ల ఏర్పాట్లు, విద్యుత్ సమస్యలు లేకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. డీఆర్వో పెంచలకిషోర్, డీపీఓ సుశీలాదేవి, ఆర్అండ్‌బీ అధికారి మధుసూదన్ రావు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి విజయకుమార్, పంచాయతీరాజ్ అధికారి శంకర్‌నారాయణ, డీఎఫ్ఓ రమణయ్య, డీఎంహెచ్ఓ శ్రీహరి తదితరులు పాల్గొనారు.

ముగిసిన ఇంజనీరింగ్ తొలి విడత అడ్మిషన్ల ప్రక్రియ

తిరుపతి సిటీ: ఏపీ ఈఏఎమ్‌సెట్–2024 కౌన్సెలింగ్‌లో భాగంగా తొలి విడత ఇంజనీరింగ్ అడ్మిషన్ల ప్రక్రియ సోమవారం ముగిసింది. ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో 6 బ్రాంచ్‌లకు కలిపి 391 సీట్లు ఉండగా అందులో 323 మంది రిపోర్ట్ చేసినట్లు అడ్మిషన్ల ఇన్‌చార్జి ప్రొఫెసర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. ఇందులో సీఎస్ఈలో 64 సీట్లు ఉండగా 47 మంది, మెకానికల్ విభాగంలో 65 సీట్లకు గాను 56 మంది, ఈసీఈలో 66 సీట్లకు గాను 52 మంది, ఈఈఈలో 65 సీట్లకు గాను 55 మంది, సివిల్‌లో 66 సీట్లకు గాను 63 మంది, కెమికల్ ఇంజినీరింగ్‌లో 65 సీట్లకు గాను 50 మంది విద్యార్థులు అడ్మిషన్ తీసుకున్నట్టు వెల్లడించారు. మిగిలిన 68 సీట్ల భర్తీకి రెండో విడత కౌన్సెలింగ్ కోసం సాంకేతిక విద్యాశాఖకు రిపోర్ట్ చేసినట్లు తెలిపారు. మహిళా వర్సిటీలోని స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో తొలివిడత అడ్మిషన్లలో అన్ని బ్రాంచ్‌లకు కలిపి 60 శాతం సీట్లు మాత్రమే భర్తీ అయినట్లు సమాచారం.



కుప్పంలో అలా.. తిరుపతిలో ఇలా!

కూటమి నేతల ఆగడాలకు అంతేలేకుండా పోతోంది. వైఎస్సార్‌సీపీ ఆధీనంలో ఉన్న కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, మండల పరిషత్‌లను కూటమి నేతలు కైవసం చేసుకునేందుకు బెదిరింపులు, దౌర్జన్యాలకు దిగుతున్నారు. ఎక్కడా వైఎస్సార్‌సీపీ పేరు వినిపించకుండా ఉండేందుకు కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి చేస్తున్నారు. 'మర్యాదగా పచ్చ కండువా కప్పుకోండి. లేదంటే మీ అంతు చూస్తాం. పాతకేసులు ఏవైనా ఉంటే తోడుతాం. లేవంటే ఏదో ఒక కేసు పెట్టి జైలుకు పంపుతాం' అంటూ పోలీసులు, ఇంటలిజెన్స్ అధికారుల ద్వారా కూటమి నేతలు బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఆ కోవలోనే చిత్తూరు కార్పొరేషన్‌తో పాటు పుంగనూరు మున్సిపాలిటీని కూటమి నేతలు దౌర్జన్యంగా వారి ఆధీనంలోకి తెచ్చుకున్నారు. ఇంకా మిగిలిన వాటిపై దృష్టి సారించారు.

- కార్పొరేషన్, మున్సిపాలిటీలే లక్ష్యంగా కూటమి కుట్రలు
- తిరుపతి మేయర్ పీఠం కోసం టీడీపీ, జనసేన పోటాపోటీ
- కార్పొరేటర్లు, కౌన్సిలర్లకు బెదిరింపులు
- పార్టీ మారాలంటూ ఒత్తిళ్లు
- కుప్పం మున్సిపల్ కౌన్సిలర్లకు ఓ పోలీసు, ఇంటలిజెన్స్ అధికారి వార్నింగ్
- తిరుపతిలో జనసేన జీరో.. తామే హీరోలంటూ టీడీపీ నేతల ప్రస్తావన
- చిత్తూరు, పుంగనూరు తరహాలో కార్పొరేషన్, మున్సిపాలిటీ కోసం బరితెగింపు

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జిల్లా పరిషత్‌తో పాటు.. తిరుపతి, చిత్తూరు కార్పొరేషన్లు, కుప్పం, పుంగనూరు, పలమనేరు, నగరి, పుత్తూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట, గూడూరు మున్సిపాలిటీలన్నింటిలోనూ వైఎస్సార్‌సీపీ నేతలే విజయం సాధించారు. మేయర్, మున్సిపల్ చైర్మన్ పీఠాలను కైవశం చేసుకున్నారు. అదేవిధంగా అన్ని మండల పరిషత్‌ల్లోనూ వైఎస్సార్‌సీపీ నేతలే ఎంపీపీలుగా వ్యవహరిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ నేతలు తమ అనుచరులను ఆ కుర్చీల్లో కూర్చోబెట్టేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు.



రంగంలోకి ఖాకీలు

ప్రజాస్వామ్య దేశంలో ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు కొందరు టీడీపీ, జనసేన నాయకుల్లా వ్యవహరిస్తున్నారు. కార్పొరేషన్, ఎంపీపీ, జెడ్పీటీసీ కుర్చీల్లో కూటమి నేతలను కూర్చోబెట్టేందుకు వైఎస్సార్‌సీపీ తరుపున గెలిచిన వారిని ప్రత్యేకంగా పిలిపించి బెదిరింపులకు పాల్పడుతున్నారు. సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను పిలిపించి టీడీపీలో చేరాలంటూ బెదిరింపులకు దిగారు. ఓ పోలీసు, ఇంటిలిజెన్స్‌లోని మరో అధికారి నేరుగా వారి నివాసాలకు, మున్సిపల్ కార్యాలయానికి పిలిపించి బెదిరించిన విషయం తెల్సిందే. వైఎస్సార్‌సీపీ తరుపున గెలిచిన మున్సిపల్ కౌన్సిలర్లందరినీ చంద్రబాబు వద్దకు తీసుకెళ్లి పచ్చకండువాలు కప్పించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అదేవిధంగా కుప్పం నియోజకవర్గం గుడుపల్లి మండల పరిధిలోని ఎంపీటీసీ, సర్పంచ్‌లను సైతం ఇదే స్థాయిలో పోలీసుల ద్వారా బెదిరింపులకు పాల్పడుతున్నారు. కొద్ది రోజుల్లో నియోజకవర్గంలో ఉన్న కౌన్సిలర్లు, ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లందరినీ అమరావతికి తీసుకెళ్లి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేర్చేటట్లు ప్రణాళికలు సిద్ధం చేసినట్టు తెలుస్తోంది.

జనసేన జీరో అంట

తిరుపతిలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతల మధ్య ఆధిపత్య పోరు తారస్థాయికి చేరింది. ఆరణి శ్రీనివాసులు ఎమ్మెల్యే అయినా.. తిరుపతిలో జనసేన జీరో.. తామే హీరోలమంటూ టీడీపీ నేతలు ప్రచారం చేసుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో తిరుపతి మేయర్ పీఠంపై టీడీపీ, జనసేన పార్టీ కార్పొరేటర్లను కూర్చోబెట్టాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. వాస్తవంగా అయితే తిరుపతిలోని 50 డివిజన్‌లలో 49 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ నేతలే విజయం సాధించారు. కేవలం ఒకే ఒక స్థానంలో టీడీపీ అభ్యర్థి కార్పొరేటర్‌గా గెలుపొందారు. ఎన్నికలకు నాలుగు రోజుల ముందు, కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత కొంత మంది వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లకు డబ్బులిచ్చి కూటమి ప్రభుత్వంలో చేర్చుకున్నారు. వారిలో ఒకరిని మేయర్ పీఠంపై కూర్చోబెట్టాలని ఇటు టీడీపీ, అటు జనసేన నేతలు తహతహలాడుతున్నారు. అందులో భాగంగా ఆదివారం కొందరు కార్పొరేటర్లతో ఆయా పార్టీలకు చెందిన నాయకులు రహస్య సమావేశాలు నిర్వహించారు. కొంతమందిని బెదిరించారు. అలాగే ఇంకొంత మందికి ప్యాకేజీ ఇస్తామని హామీ ఇచ్చారు. తిరుపతిలో జనసేన జీరో అని, టీడీపీ నేతలే హీరోలని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లతో అన్నట్లు తెలిసింది. ఇదిలా ఉంటే.. తాము అడిగినంత డబ్బు ఇచి, పార్టీ మారితే మేయర్, చైర్మన్ కుర్చీలో మీరే కొనసాగవచ్చుంటూ ఆఫర్ చెస్తున్నట్టు తెలుస్తుంది. ఈ సందర్భంగా కొందరు ప్రాణం ఉన్నంత వరకు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లగానే ఉంటామని, పార్టీ మారే ఆలోచనే లేదని తేల్చిచెప్పడం విశేషం.

పోలీస్‌శాఖకు 101 ఫిర్యాదులు



ఎస్పీకి ఫిర్యాదులు అందజేస్తున్న బాధితులు

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 101 ఫిర్యాదులు వెవచ్చినట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. ఇందులో దొంగతనాలు, ఆస్తి తగాదాలు, ఆర్థికపరమైన లావాదేవీలు ఉన్నాయని, సత్వరం వీటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్టు వెల్లడించారు.

ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు



వైద్యాధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

తిరుపతి అర్బన్: ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహించడానికి జిల్లాలో రెండు పింక్ బస్సులను ఏర్పాటు చేశామని.. ఎక్కడికక్కడ స్థానికులను క్యాంపులకు ఎంఎల్‌హెచ్‌పీలు తీసుకురావాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వైద్యాధికారులతో ఆయన సమీక్షించారు. త్వరలో ఎంఎల్‌హెచ్‌పీలకు ఒక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. పింక్ బస్సు షెడ్యూల్ ప్రకారం స్థానికులను క్యాంపులకు తీసుకొచ్చేలా చర్యలు చేపట్టాలని బయో నిర్వాహకుడు డాక్టర్ ఎం.జయచంద్రారెడ్డికి వివరించారు. తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో శ్రీబాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ(బయో) ద్వారా జిల్లాలోని పీహెచ్‌సీల పరిధిలో పింక్ క్యాంపులు ఉంటాయని, తొలి దశలోనే క్యాన్సర్‌ను గుర్తించడం ద్వారా సమస్యకు పరిష్కారం లభిస్తోందని చెప్పారు. స్విమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కె.నాగరాజ్, నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.లలిత్ పాల్గొన్నారు.

నాని కక్షగట్టి వేధిస్తున్నారన్నా!

'అన్నా.. ఎమ్మెల్యే నాని మాపై పగబట్టారు. వైఎస్సార్‌సీపీ సానుభూపతిపరులు, కార్యకర్తలనే టార్గెట్ చేసి తన అనుచరులతో దౌర్జన్యాలు చేయిస్తున్నారు. అప్పు చేసి కట్టుకుంటున్న ఇళ్లను కూల్చేస్తున్నారు. ఆస్తులు ధ్వంసం చేస్తున్నారు. మా బిడ్డలు కనిపిస్తే మట్టుబెట్టడానికి సిద్ధమయ్యారు. అర్ధరాత్రి సమయంలో ఇళ్లల్లోకి దూరి దాడులకు దిగుతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియడం లేదు. ఇంట్లో ఉండాలంటనే భయమేస్తోంది'.. అంటూ పలువురు బాధితులు కన్నీటిపర్యంతమయ్యారు. నాని అనుచరుల దాడులతో నష్టపోయిన బాధితులను సోమవారం మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. దాడులకు భయపడొద్దని.. అందరూ కలసికట్టుగా ఎదుర్కోవాలని ఆయన వారికి ధైర్యం నూరిపోశారు. ఆర్థికంగా ఆదుకుంటానని భరోసానిచ్చారు.

- ఎమ్మెల్యే అనుచరులు విధ్వంసం సృష్టిస్తున్నారు
- వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఇళ్లు కూల్చేస్తున్నారు
- గోడు వెళ్లబోసుకున్న బాధితులు
- బాధితుల కన్నీళ్లు తుడిచి..ధైర్యం చెప్పిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి




అగరాల జగనన్న కాలనీలో కూల్చేసిన చంద్రమ్మ ఇంటిని పరిశీలిస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

సాక్షి, నెట్‌వర్క్: మండల పరిధిలోని అగరాల జగనన్న కాలనీలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులైన చంద్రమ్మ కట్టుకుంటున్న ఇంటిని ఆదివారం రాత్రి ఎమ్మెల్యే నాని అనుచరులు జేసీబీతో కూల్చివేశారు. పక్కనే ఉన్న ముఖేష్ ఇంటిపై ఉన్న వాటర్ ట్యాంక్, నీళ్లపైపులను ధ్వంసం చేశారు. హమీద్ ఇంటి ముందున్న మెట్లను కూలదోశారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సోమవారం ఆయా బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితురాలు చంద్రమ్మ మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల అనంతరం మా కుటుంబంపై ఎమ్మెల్యే నాని అనుచరులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని బోరున విలపించారు. తన కోడలు నిండు గర్భిణి అని, కుమారుడు ఇంటికొస్తే ఎమ్మెల్యే నాని అనుచరులు మట్టుబెట్టడానికి సిద్ధంగా ఉన్నారని వాపోయారు. దీంతో రెండు నెలలుగా ఇంటికి రాకుండా బయట తలదాచుకుంటున్నాడని వాపోయారు. అప్పు చేసి కట్టుకుంటున్న ఇంటిని అకారణంగా కూల్చేశారని, చేసిన అప్పులు కూడా ఇంకా తీర్చలేదన్నారు. 'మీరు వైఎస్సార్‌సీపీ వాళ్ల వెంట తిరిగారు కదా.. మిమల్ని చంపేస్తామంటూ' అర్ధరాత్రి సమయాల్లో ఇంటి వద్దకు వచ్చి గొడవలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాని అనుచరులు మరికొంత మంది ఇంటిని తగలబెట్టేస్తామంటూ బెదిరిస్తున్నారని, ఇంట్లో ఉండాలంటే భయంగా ఉందని వాపోయారు. ఎమ్మెల్యే నాని అనుచరుల వేధింపులకు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోవాలనిపిస్తోందంటూ బోరున విలపించారు. ఆదివారం తాము అగరాలలోని ఇంటి వద్ద ఉండగా జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న మా ఇంటిని కూల్చేశారని తెలిపారు. ఇప్పుడు మా ఆవేదన మీతో చెప్పినందుకు కూడా మాపై దాడి చేస్తారేమోనని భయంగా ఉందని వాపోయారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి స్పందిస్తూ ఇంటి నిర్మాణానప్ని పూర్తి చేసుకునేందుకు ఆర్థిక సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో ఇటువంటి హింసాకాండను ప్రోత్సహించలేదన్నారు. పార్టీలకు అతీతంగా అందరికీ మేలు చేశామే తప్ప, ఎటువంటి హానీ తలపెట్టలేదని గుర్తుచేశారు. అయితే నాని ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి పేద, బడుగు, బలహీన వర్గాలపై దాడులు, దౌర్జన్యాలు నిత్యకృత్యమయ్యాయన్నారు. ఇలాంటి దాడులను ప్రజలను కూడా గమనిస్తూనే ఉన్నారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు నిత్యం అందుబాటులో ఉంటానిన వారికి ధైర్యం చెప్పారు. అందరం కలసి కట్టుగా ఈ దౌర్జన్యాలపై పోరాడేందుకు సంసిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఏ కార్యకర్తకు ఎటువంటి హాని జరిగినా ఎవరినీ వదిలిపెట్టేదిలేదని ఆయన స్పష్టం చేశారు. టీడీపీ అరాచకాలు, అన్యాయాలపై న్యాయపోరాటంతో పాటు ప్రజాస్వామ్యంలో ప్రజలకు కూడా వివరిస్తామన్నారు. తన కార్యకర్తలే తనకు బలమని, అటువంటిది వారిపై దాడులు జరుగుతుంటే చూస్తూ ఊరుకోలేక వారి మధ్యలోనే ఉన్నానని తెలిపారు. ప్రశాంతతకు మారుపేరుగా నిలిచిన చంద్రగిరిని ఈ నెల 45 రోజుల్లో బిహార్‌గా మార్చారంటూ ఆయన మండిపడ్డారు. టీడీపీ నాయకులు చేస్తున్న ప్రతి దాడికీ వారు ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. హింసాత్మకైన ఇటువంటి కొత్త సంస్కృతి పేరుతో నాటిన మొక్కే, భవిష్యత్‌లో వారి పాలిట శాపంగా మారుతుందన్నారు. అగరాల సర్పంచ్ భాస్కర్ రెడ్డి, మాజీ సింగల్ విండో చైర్మన్ దేవారెడ్డి, సిద్ధారెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శిస్తూ.. ధైర్యం నూరిపోస్తూ..


పాకాల: పాకాలలో ఆదివారం రాత్రి టీడీపీ మూకల దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ నేత కపిలేశ్వర్‌రెడ్డి, మరికొంత మందిని సోమవారం మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో టీడీపీ కార్యకర్తలను ఒక్కమాట కూడా అనలేదన్నారు. ఇలాగే దాడులు కొనసాగితే రోడ్లపైకి రావాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం కపిలేశ్వర్‌రెడ్డి సమీప బంధువులైన పలు దుకాణాలు ధ్వంసం చేయడంతో అక్కడికెళ్లి వారిని పరామర్శించారు. నిందితులను అరెస్ట్ చేసి జైలుకు పంపాలని పోలీసులకు సూచించారు. పోలీసులు స్పందిస్తూ దాడికి పాల్పడ్డవారిపై కేసులు నమోదుచేసి అరెస్టు చేస్తామని హామీ ఇవ్వడంతో అక్కడి నుంచి వెనుదిరిగారు. తర్వాత వల్లివేడుకు చేరుకుని సర్పంచ్ నానిపై ఇటీవల దాడి చేయడంతో ఆ కుంటుంబీకులను పరామర్శించి ధైర్యం చెప్పారు.



పంటపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న చెవిరెడ్డి

అడుగడుగునా అడ్డంకులు

బాధితులను పరామర్శించేందుకు చెవిరెడ్డి బయల్దేరగా పోలీసులు అడుగడుగునా అడ్డంకులు సృష్టించారు. ఆయనకు నోటీసులు అందజేసి ఇంటి వద్దనే గృహ నిర్బంధం చేసేందుకు యత్నించారు. అయితే చెవిరెడ్డి లెక్క చేయలేదు. పోలీసులు బందోబస్తు నడుమ గ్రామాల్లోకి వెళ్లి బాధితులను పరామర్శించారు.



పోలీసులతో మాట్లాడుతున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

పాకాలలో పోలీసుల హడావిడి

పాకాల మండల కేంద్రంతో పాటు పంటపల్లిలో పోలీసుల హడావిడి చేశారు. చెవిరెడ్డి రాకతో పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. అయితే గ్రామంలో ఎక్కడా రెచ్చగొట్టేలా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడకుండా సంయమనం పాటించారు. బాధితులను ఓదార్చి ధైర్యం చెప్పారు.

పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

తిరుపతి తుడా: ఎస్వీ వైద్య కళాశాలలో రెండేళ్ల కాల వ్యవధి గల పారామెడికల్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అలైడ్ అండ్ హెల్త్ కేర్ ప్రొఫెషన్ కౌన్సిల్ పరిధిలో పారా మెడికల్ కోర్సుల్లో 2024–25 అకడమిక్ ఇయర్‌కు సీట్లు భర్తీ చేస్తున్నట్టు వెల్లడించారు. ఇంటర్‌లో బైపీసీ, ఎంపీసీలో ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ -30, డిప్లొమా ఇన్ అనస్తీషియా టెక్నీషియన్- 30 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. అర్హత కలిగిన వారు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీపీఎంబీ.కో.ఇన్ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకుని పూర్తి చేసి ఆగస్టు 6వ తేదీలోపు ఎస్వీ మెడికల్ కళాశాల పారామెడికల్ విభాగంలో రూ.100 చెల్లించి అందజేయాలని కోరారు. వివరాలకు 9440879943లో సంప్రదించాలని సూచించారు.

పూర్వ విద్యార్థులైన వీసీలకు సన్మానం



మాట్లాడుతున్న సింహపురి, ద్రవిడ, ఎస్వీయూ వీసీలు

తిరుపతి సిటీ: పలు యూనివర్సిటీలకు వీసీలుగా నియమితులైన ఎస్వీయూ పూర్వ విద్యార్థులను సోమవారం ఎస్వీయూ గ్రంథాలయ సిబ్బంది ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వీసీలు మాట్లాడుతూ ఎస్వీయూలో విద్యనభ్యసించడం అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. వర్సిటీ గ్రంథాలయం విద్యార్థులకు విజ్ఞాన భాండాగారమని కొనియాడారు. ఈ సందర్భంగా ఎస్వీయూలో చదివి వీసీలుగా బాధ్యతలు చేపట్టిన ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ అప్పారావు, సింహపురి వర్సిటీ వీసీ ఎస్ విజయ భాస్కర్‌రావు, ద్రవిడ వర్సిటీ వీసీ దొరస్వామి, ఎస్వీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతిరావును వారు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సురేంద్రబాబు, లైబ్రరీ సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి అంతర్ జిల్లాల ఫుట్‌బాల్ పోటీలు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో మంగళవారం నుంచి ఈ నెల 25వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి అండర్–14 బాలికల అంతర్ జిల్లాల ఫుట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలను ఒలింపిక్ ఇండియన్ హాకీ ప్లేయర్ రజిని, వర్సిటీ వీసీ ఉమ ప్రారంభిస్తారని వెల్లడించారు. ఇక్కడ ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసి ఆల్ ఇండియా ఫుట్‌బాల్ పోటీలకు పంపుతామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

అద్దె భవనాల్లో అంగన్‌వాడీలు


డీఆర్వోకు వినతిపత్రాన్ని అందిస్తున్న సామాజిక చైతన్య వేదిక ప్రతినిధులు

తిరుపతి అర్బన్: జిల్లాలోని పలు చోట్ల అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయని, అక్కడ చాలీచాలని వసతుల నడుమ సమస్యలు ఎదురవుతున్నట్టు సామాజిక చైతన్యవేదిక ప్రతినిధులు డీఆర్వో పెంచలకిషోర్‌కు విన్నవించారు. ఈ మేరకు సోమవారం గ్రీవెన్స్ సందర్భంగా కలెక్టరేట్‌లో వారు ఏయే పాఠశాలల్లో ఎలాంటి సమస్యలున్నాయో వివరించారు. మిని అంగన్‌వాడీ స్కూల్స్‌ను మేజర్ అంగన్‌వాడీ స్కూల్స్‌గా మార్పు చేయాలని కోరారు. రేణిగుంట, ఏర్పేడు, శ్రీకాళహస్తి మండలాల్లోని పాఠశాలల అభివృద్ధికి తాము చేసిన కృషిని వివరించారు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మహేష్ మృతదేహం

ఏర్పేడు: మండలంలోని పల్లం సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందగా మరొకరు గాయపడినట్టు సీఐ శ్రీరామశ్రీనివాసులు తెలిపారు. సీఐ కథనం.. మండలంలోని చింతలపాళెం గ్రామానికి చెందిన మహేష్(25), వెంకటేష్(28) ట్రాక్టర్‌లో పల్లం నుంచి చింతలపాళెంకు వెళ్తుండగా పల్లం సమీపంలో వెంకటగిరి నుంచి ఏర్పేడుకు వెళుతున్న లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో మహేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. వెంకటేష్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్ రోహిత్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ చెప్పారు.

అమ్మో.. గ్రీవెన్స్

- మూడు దశల్లో తనిఖీలు
- అధికారులను కలవడం గగనమే
- ప్రజాసమస్యల పరిష్కార వేదికపై అసంతృప్తి

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజాసమస్యల పరిష్కార వేదికపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులను కలవాలంటే సామాన్యులకు గగనంగా మారుతోంది. కాస్త పలుకుబడి, అధికార పార్టీకి చెందిన వారు నేరుగా అధికారులను కలిసి సమస్యలు విన్నవిస్తున్నారు. ఇక సామాన్యులు, వృద్ధులు, దివ్యాంగులైతే గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. దీనికి తోడు పోలీసుల ఓవరాక్షన్ మరింత ఇబ్బందికరంగా మారుతోంది. గతంలో అర్జీలను రాయడానికి అప్పటి కలెక్టర్ వెంకటరమణారెడ్డి కొందరు వీఆర్వోలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం తూతూమంత్రంగా వీర్వోలు విధులు నిర్వహిస్తున్నారు. ముందుగా కలెక్టరేట్‌లో అర్జీ చూపించి టోకెన్ నంబర్ వేయించుకోవాలి. లేకుంటే అక్కడున్న వీఆర్వోల చెంత అర్జీలు రాయించుకోవాలి. అయితే అక్కడ అవసరమైన మేరకు వీఆర్వోలు లేకపోవడంతో అర్జీదారులే అర్జీలు రాసుకుని టోకెన్ నంబర్ వేసుకుని వెళ్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు ముందుగా మెటల్‌డిటెక్టర్స్‌తో, ఆ తర్వాత కౌంటర్‌లో అర్జీలను కంప్యూటర్‌లో ఫీడింగ్ చేసేటప్పుడు, మళ్లీ గ్రీవెన్స్ హాల్ నుంచి అధికారుల వద్దకు వెళ్లేటప్పుడు ఇలా మూడు సార్లు తనిఖీలు చేస్తున్నారు. కాస్త రాజకీయ పలుకుబడి ఉన్నోళ్లు, అధికార పార్టీకి చెందిన వారు నేరుగా వెళ్లి అర్జీలను కలెక్టర్‌తోపాటు ఇతర అధికారులకు అందిస్తున్నారు. ఈ క్రమంలో వృద్ధులు, వికలాంగులు, సామాన్య గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది.

మధ్యాహ్నం 2.15 వరకు గ్రీవెన్స్

సాధారణంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గ్రీవెన్స్(ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమాన్ని ముగించాల్సి ఉంది. అయితే సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2.15 గంటల వరకు నిర్వహించారు. రాజకీయ పలుకుబడి ఉన్న వారు ముందుగా వెళ్లి గంటల కొద్దీ సమస్యలు చెప్పుకోవడంతో సామాన్యులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. దీనికితోడు తాగునీటి సౌకర్యం కూడా లేకపోవడంతో ఫిర్యాదుదారులు గొంతు తడుపుకోవడానికి నానా ఇక్కట్లు పడాల్సి వచ్చింది.


నేరుగా వెళుతున్న రాజకీయ పలుకుబడి ఉన్నవారు

మళ్లీ జెడ్పీ చాంబర్‌కు గ్రీవెన్స్ మార్పు

2022 ఏప్రిల్ 4వ తేదీన తిరుపతి జిల్లా కలెక్టరేట్ ఏర్పాటైంది. అప్పటి నుంచి కలెక్టరేట్‌లోనే కింది భాగంలోని హాల్‌లో గ్రీవెన్స్ నిర్వహించే వారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సమీపంలోని జిల్లా పరిషత్ కార్యాలయం కోసం ఏర్పాటు చేసిన చాంబర్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని చేపట్టారు. ఇక్కడ రీసౌండ్, ఇతర అసౌకర్యాల కారణంగా ఫిర్యాదుదారులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.


గంటల కొద్దీ నిరీక్షిస్తున్న సామాన్యులు, వృద్ధులు, దివ్యాంగులు


మూడో దశ(గ్రీవెన్స్ గేటు)వద్ద పోలీసులు

ప్రతి సమస్యకు పరిష్కారం


అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతామని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 146 అర్జీలు వచ్చాయన్నారు. ఇందులో 112 అర్జీలు రెవెన్యూకు సంబంధించినవి ఉన్నాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన రోజు నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 625 అర్జీలు వచ్చాయని, అందులో ఇప్పటి వరకు 285 అర్జీలకు పరిష్కారం చూపించామని తెలిపారు. డీఆర్వో పెంచల కిషోర్, డిప్యూటీ కలెక్టర్లు మురళి, దేవేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు

తిరుపతిలో ట్రయింఫ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ప్రారంభం


ట్రయింఫ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న డీటీవో ఆదినారాయణ, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: రేణిగుంట రోడ్డులో ఏర్పాటు చేసిన ట్రయింఫ్ తిరుపతి ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీటీవో జి.ఆదినారాయణ మాట్లాడుతూ ఔత్సాహిక రైడర్లు, బలమైన బైకింగ్ సంస్కృతిని, బలమైన కమ్యూనిటీని పెంపొందించడానికి ట్రయింఫ్ బ్రాండ్ సరైన ఎంపికగా నిలుస్తుందన్నారు. ప్రో బైకింగ్ సర్కిల్ హెడ్ గౌతమ్ మోదీ, రీజనల్ మేనేజర్(సర్వీస్) సౌత్–1 నీరజ్‌తివారి, ఏరియా సేల్స్ మేనేజర్ రాజీవ్ కన్నన్, ఏరియా సర్వీస్ మేనేజర్ ప్రభు, గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్‌దేవ్ ప్రసంగించారు. కొత్త ట్రయింఫ్ యజమానులు తమ బైక్‌లను ఒరిజినల్ ట్రయింఫ్ ఎక్సెసరీస్‌తో తమకు కావాల్సిన రీతిలో మార్చుకోవచ్చన్నారు. స్టీరింగ్ సౌకర్యం నుంచి సామాను, భద్రత వరకు బైక్‌ను విస్తృత శ్రేణి రైడర్‌ల అవసరాలకు అనుగుణంగా చేసుకోవచ్చని తెలిపారు. కొత్త కస్టమర్లు 16,000 కిలోమీటర్ల సర్వీస్ సేవలు, రెండేళ్ల పరిమిత మైలేజ్ వారంటీ, మరో మూడేళ్ల పొడిగించిన వారంటీని సైతం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రయింఫ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 30 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 75,963 మంది స్వామిని దర్శించుకున్నారు. 26,956 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.99 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని వారికి 18 గంటల్లో దర్శనం లభిస్తోంది.

భాకరాపేట కనుమలో లారీ బోల్తా



ప్రమాదంలో దెబ్బతిన్న ఇన్నోవా కారు, లగేజీ ఆటో (ఇన్‌సెట్) మృతి చెందిన లారీ క్లీనర్ అల్తాఫ్

- క్లీనర్ మృతి
- మరో నలుగురికి గాయాలు

చంద్రగిరి: భాకరాపేట కనుమలో ఓ లారీ బీభత్సం సృష్టించింది. ముందు వెళ్తున్న కారు, టమాటా లోడ్డుతో వెళ్తున్న ఆటోను ఢీకొట్టి, ఫల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో క్లీనర్ మృతి చెందగా, డ్రైవరుతో పాటు మరో ముగ్గురు గాయాలపాలైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మధ్యప్రదేశ్ నుంచి తిరుపతికి ఓ లారీ సున్నం లోడ్డుతో వస్తోంది. సోమవారం మధ్యాహ్నం భాకరాపేట కనుమలో వస్తున్న క్రమంలో లారీ అదుపు తప్పి టమాట లోడ్డుతో ముందు వెళ్తున్న లగేజీ ఆటోను, ధర్మవరం నుంచి తిరుపతికి వస్తున్న ఇన్నోవా కారును ఢీకొట్టింది. దీంతో కారు లోయలోకి దూసుకెళ్లింది. అనంతరం లారీ పీటీసీ సమీపంలోని పెద్ద మలుపు వద్ద చెట్లలోకి దూసుకెళ్లి ఫల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో లారీ నుజ్జునుజ్జుకాగా, లారీ క్లీనర్ అల్తాఫ్(33) అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవరు అబ్దుల్లాకు తీవ్ర గాయాలయ్యాయి. ఇన్నోవాలోని బాలమురళీకృష్ణ, చంద్రశేఖర్‌మౌళి, వెంకటశివ గాయపడ్డారు. ఆటోలోని దంపతులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనంలో మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు. మృతి చెందిన అల్తాఫ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. లారీలో సున్నపు లోడ్డు పరిమితికి మించి ఉండటంతోనే వాహనం అదుపు తప్పి ప్రమాదానికి గురైనట్లు ప్రయాణికులు భావిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి అదే కోణంగా విచారణ చేస్తున్నారు.

కలెక్టరేట్‌లో ఆగిన లిఫ్ట్

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10.50 గంటలకు లిఫ్ట్ ఆగిపోయింది. దీంతో వివిధ సమస్యల కోసం వచ్చిన జిల్లా ప్రజలతో పాటు ఉద్యోగులు తిప్పలు పడాల్సి వచ్చింది. తిరుపతి కలెక్టరేట్ కార్యాలయం ఏడు అంతస్తులు ఉంది. ఒక్కో అంతస్తులో మూడు నుంచి నాలుగు కార్యాలయాలు ఉన్నాయి. ఒక్కో కార్యాలయంలో 10 నుంచి 20 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. కలెక్టరేట్‌లో ఏ, బీ పేరుతో రెండు బ్లాక్‌లు ఉన్నాయి. ఒక్కో బ్లాక్‌కు రెండు లిఫ్ట్‌లు ఏర్పాటు చేశారు. లిఫ్ట్ పనిచేస్తేనే వృద్ధులైన పలువురు ఉద్యోగులు తమ కార్యాలయానికి వెళ్లగలుగుతారు. లేదంటే కిందే ఉండిపోతారు. అయితే సోమవారం బీ బ్లాక్‌కి చెందిన ఓ లిఫ్ట్ ఓపెన్ అయిన తర్వాత ఆగిపోయింది. బీ బ్లాక్‌లో ఒక లిఫ్ట్ ఆగిపోవడంతో మరోలిఫ్ట్ రద్దీగా మారింది. గ్రీవెన్స్‌కు వచ్చిన పలువురు కలెక్టరేట్ ఏవో జయరాములకు సమాచారం ఇచ్చారు. ఆయన లిఫ్ట్‌ను పరిశీలించారు. ఎవర్నీ లోనికి వెళ్లకుండా రెండు రాండ్లు అడ్డుగా పెట్టి వెళ్లిపోయారు. తర్వాత 1.30 గంటలకు మరమ్మతులు చేయించారు. ఇటీవల ఒక రోజు విద్యుత్ అంతరాయం చోటుచేసుకుంది. ఆ రోజు ఉద్యోగులు మెట్లు ఎక్కి పైకి వెళ్లలేక కిందే ఉండి తమ కార్యకలాపాలను నిర్వహించారు.


బీ బ్లాక్‌లోని ఎడమ వైపు ఉన్న లిఫ్ట్ వద్ద రద్దీ


బీ బ్లాక్‌లో ఆగిన కుడి వైపున ఉన్న లిఫ్ట్

టిప్పర్ ఢీకొని మహిళ మృతి


మృతి చెందిన ఉమా

సత్యవేడు: పట్టణంలోని స్టేట్ బ్యాంకు సమీపంలో సోమవారం మధ్యాహ్నం నేతాజీ రోడ్డుపై టిప్పర్ ఢీకొని ఓ మహిళ మృతిచెందిన ఘటన స్థానికంగా విషాదాన్ని మిగిల్చింది. వివరాలు.. పంచాయతీ పరిధిలోని ఊళవేనులో కే.ఉమా, ప్రేమ్‌నాథ్ దంపతులు నివసిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇందులో అనిల్ 6వ తరగతి, జీవన్ ఒకటో తరగతి చదువుతున్నారు. చిన్న అబ్బాయి ఓ ప్రయివేటు స్కూల్‌లో చదువుతుండగా.. సోమవారం మధ్యాహ్నం ఉమా(35) పిల్లవాడికి భోజనం పెట్టి తిరిగి ఇంటికి నడుచుకుంటూ వస్తోంది. స్టేట్ బ్యాంక్ సమీపంలో వెనుక వైపు నుంచి ఉమాను ఢీకొట్టింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ వీరాంజనేయులు తెలిపారు.

పరిహారం ఇవ్వండి


వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న ఆర్.మల్లవరం విద్యార్థుల తల్లిదండ్రులు

తిరుపతి అర్బన్: రేణిగుంట మండలంలోని ఆర్.మల్లవరం ప్రాథమిక పాఠశాల భవనం పుతలపట్టు–నాయుడుపేట హైవే రహదారి విస్తరణలో భాగంగా తొలగించారని, పాఠశాల భవనానికి పరిహారం కింద రూ.14 లక్షలు ఇస్తామని చెప్పి ఇంతవరకు ఇవ్వలేదని రేణిగుంట మండలం ఆర్ మల్లవల్లరానికి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు వాపోయారు. ఈ క్రమంలో అద్దె భవనంలో పాఠశాల నిర్వహిస్తున్నారని తెలిపారు. పాఠశాలలో 30 మంది విద్యార్థులుండగా.. పాఠశాల భవన నిర్మాణానికి ఓ దాత స్థలాన్ని విరాళంగా అందించారని, కానీ నిధులు లేక నిర్మాణం చేపట్టలేకపోతున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందించారు.

గిరిజనుల నిరసన


పట్టాదారు పాసుపుస్తకాలతో నిరసన తెలుపుతున్న గిరిజనులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కంచనపుత్తూరు గ్రామంలోని గిరిజనులకు 40 సంవత్సరాల క్రితం పంపిణీ చేసిన భూమిలో రెవెన్యూ సిబ్బంది హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయడంపై సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద పలువురు నిరసనకు దిగారు. గిరిజనులు మాట్లాడుతూ కంచనపుత్తూరు గ్రామానికి చెందిన 15 గిరిజన కుటుంబాలకు ఇదే గ్రామ రెవెన్యూ పరిధిలోని 460, 461, 462, 463, 464, 465 సర్వే నంబర్లలో 14 ఎకరాల భూమిని 40 సంవత్సరాల క్రితం పంపిణీ చేశారని తెలిపారు. నిరుపేదలైన తాము ఆ భూమిని సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నామన్నారు. అయితే రెవెన్యూ అధికారులు కొందరు భూస్వాముల పలుకుబడితో సాగు చేసుకుంటున్న భూమిలోకి ఎవరూ ప్రవేశించకూడదని హెచ్చరిక బోర్డును పెట్టడం అన్యాయమని మండిపడ్డారు. హెచ్చరిక బోర్డును తొలగించకపోతే ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దారు మహ్మద్ పటాన్ ఆలీఖాన్‌కు వినతి పత్రం ఇచ్చారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ రికార్డులను పరిశీలించి, బోర్డును తొలగించాలని వీఆర్‌ఓ వేంకటేశ్వర్లును ఆదేశించారు.

రాజకీయ వేధింపులు తగవు


కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నేతలు

తిరుపతి అర్బన్: టీడీపీ కూటమి నేతలు చిరుద్యోగులకు రాజకీయరంగు పులిమి రాజీనామా చేయాలంటూ అలజడి సృష్టిస్తున్నారని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మండిపడ్డారు. కలెక్టరేట్ వద్ద సోమవారం చిరుద్యోగులపై కూటమి నేతల వేధింపులకు నిరసనగా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చోటామోటా నేతలు సైతం తాము అధికారంలోకి వచ్చామంటూ చిరుఉద్యోగులపై ప్రతాపం చూపుతున్నారని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు, సంఘమిత్రలు, ఉపాధిహామీ ఫీల్డ్ అసిసెంట్లను ఉద్యోగం నుంచి తప్పుకోవాలంటూ ఒత్తిడి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు మంచి చేస్తారని ఎన్నుకుంటే ఇలా ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేయడం భావ్యం కాదని, తీరు మార్చుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బాలసుబ్రమణ్యం, కోశాధికారి కేఎస్ఎన్ ప్రసాదరావు, జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

కడలూరు స్టీమ్ బోట్లు వస్తే సహించం


తూపిలిపాళెంలో సమావేశమైన ఆంధ్ర, తమిళనాడు మత్స్యకారులు

వాకాడు : తాము సాధారణ బోట్లతో చేపలు పట్టుకుని జీవనం సాగిస్తున్నామని, పొరుగు రాష్ట్రాల మత్స్యకారులు స్టీమ్ బోట్లతో ఇక్కడికి వచ్చి మత్స్య సంపదను దోచుకుంటున్నారని ఆంధ్రా, తమిళనాడు మత్స్యకారులు వాపోయారు. ఆంధ్రా, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన మత్స్యకారులు సోమవారం వాకాడు మండలం, తూపిలిపాళెం గ్రామంలో సమావేశమయ్యారు. తూపిలిపాళెం కాపు మహీంద్ర మాట్లాడుతూ ఆంధ్రా, తమిళనాడు మత్స్యకారులు సముద్రంలోని తమ పరిధిలోపే చేపలు పట్టుకుంటున్నారని తెలిపారు, కడలూరు, పాండిచ్చేరి తదితర ప్రాంతాలకు చెందిన వారు నిబంధనలను ఉల్లంఘించి స్టీమ్ బోట్లతో తమ పరిధిలోకి చొరబడి మత్స్య సంపదను దోచుకుంటున్నారని తెలిపారు. అడ్డొచ్చిన తమ బోట్లపై బండ రాళ్లతో దాడులు చేస్తున్నారని, మత్స్యకారులను గాయపరుస్తున్నారని వాపోయారు. ఈ తంతు చాలాకాలంగా జరుగుతున్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని వెల్లడించారు. వాటిని అరికట్టేందుకు తమిళనాడు, ఆంధ్రా మత్స్యకారులు ఐక్యంగా ముందుకొచ్చి చర్చించుకున్నట్టు పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించి వేట సాగించే స్టీమ్ బోట్లు ఇకపై ఆంధ్రా, తమిళనాడు సముద్ర తీరానికి వస్తే ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న నిర్ణయంపై రెండు రాష్ట్రాల మత్స్యకారులు చర్చించుకున్నట్టు తెలిపారు. ఇప్పటికే తమిళనాడు ప్రాంతంలో రెండు బోట్లను తమ అదుపులోకి తీసుకున్నామని వివరించారు.

పీజీ పరీక్షా కేంద్రాల పరిశీలన


పీజీ పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న వీసీ అప్పారావు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో పీజీ కోర్సులకు సంబంధించి ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్ రెండో సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పరీక్ష కేంద్రాలను సోమవారం నూతన వీసీ సీహెచ్ అప్పారావు పరిశీలించారు. పరీక్షల నిర్వహణపై వర్సిటీ అధికారులను అభినందించారు.

31 నుంచి శ్రీకోదండరాముడి పవిత్రోత్సవాలు

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామస్వామి వారి ఆలయంలో ఈ నెల 31 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు స్వామి వారి పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు 30వ తేదీ సాయంత్రం అంకురార్పణతో ఈ ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఆలయంలో ఏడాదిలో చేపట్టిన వివిధ కార్యక్రమాల్లో తెలిసీ తెలియక జరిగే దోషాల కారణంగా ఆలయ పవిత్రతకు లోపం రాకుండా ప్రతి ఏటా మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గృహస్తులు ఇద్దరు రూ.500 చెల్లించి పవిత్రోత్సవాల్లో పాల్గొనవచ్చు.